శంషాబాద్ ఎయిర్‌కార్గోకు గోల్డెన్ అవార్డు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 3: హైదరాబాద్ విమానాశ్రయానికి మరో అవార్డు వరించింది. శంషాబాద్ ఎయిర్‌కార్గోకు 'టైం క్రిటికల్ లాజిస్టిక్స్ సొల్యూషన్ ప్రొవైడర్ ఆఫ్ ది ఈయర్ విభాగంలో ప్రతిష్ఠాత్మక గోల్డెన్ అవార్డు లభించింది. చెన్నైలో జరిగిన 5వ సౌత్ ఈస్ట్ ఎయిర్‌కార్గో కాంక్లేవ్ అండ్ అవార్డు-2024లో ఈ అవార్డును కంపెనీ ప్రతినిధులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ పణికర్ మాట్లాడుతూ.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ పరిష్కారాలను అందించడంలో నిబద్ధతను పాటించడం వల్లనే ఈ అవార్డులు లభిస్తున్నాయన్నారు. ఈ అవార్డు రాకతో సంస్థపై అంతర్జాతీయ కస్టమర్లకు నమ్మకం పెరిగిందని, అలాగే మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడానికి నిధులు వెచ్చించనున్నట్లు చెప్పారు.

మూడోరోజూ లాభాల్లోనే..

ముంబై, డిసెంబర్ 3: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు లాభాల్లో ముగిశాయి. బ్లూచిప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో సూచీలు కదంతొక్కాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 597.67 పాయింట్లు అందుకొని 80,845.75 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 181.10 పాయింట్లు అందుకొని 24,457.15 వద్ద నిలిచింది. అదానీ గ్రూపు షేర్లు క్రమంగా కోలుకుంటున్నాయి. స్టాక్ మార్కెట్లో లిస్టైన 11 సంస్థల్లో ఏడు కంపెనీలు లాభాల్లో ముగిశాయి. వీటితోపాటు ఎయిర్‌టెల్, ఐటీసీ, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, కొటక్ మహీంద్రాలు నష్టపోయాయి.

జీఎస్టీలో 35 శాతం శ్లాబ్!

త్వరలో పరిచయం చేసే దిశగా మోదీ సర్కారు అడుగులు

సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు, శీతల పానీయాలు, గ్యాంబ్లింగ్‌పై విధించే అవకాశం • 21న జీఎస్టీ కౌన్సిల్‌లో నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) శ్లాబుల్లో కొత్తగా మరొకటి రాబోతున్నదా? ఇప్పుడున్న 5, 12, 18, 28 శాతం శ్లాబులకుతోడు ప్రత్యేకంగా గరిష్ఠ శ్రేణిలో మరో శ్లాబు ఉండబోతున్నదా? అంటే.. అవుననే సమాధానాలే కేంద్ర ప్రభుత్వ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. జీఎస్టీ రేటు హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందం.. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు, వివిధ రకాల శీతల పానీయాలు, గ్యాంబ్లింగ్‌పై 35 శాతం పన్ను వేయాలని ప్రతిపాదించింది మరి. ప్రస్తుతం ఇవన్నీ 28 శాతంలోనే ఉన్నాయి. ఇక సెస్సుతో కలిపితే పన్ను పోటు 57 శాతానికి చేరుతుండటం గమనార్హం. బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని మంత్రుల బృందం ప్రతిపాదిత జీఎస్టీ రేట్ల సర్దుబాట్లపై తాజాగా సమావేశమైంది. ఈ క్రమంలోనే ఆరోగ్యానికి హానికరమైన, సమాజాన్ని పెడదోవ పట్టించేవాటిపై (సిన్ గూడ్స్) పన్నులను పెంచాలన్న నిర్ణయానికి సభ్యులు వచ్చారు.

21న నిర్ణయం?

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వంలో ఈ నెల 21న జరుగబోయే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రుల బృందం చేసిన ఈ సిఫార్సులు చర్చకు రానున్నాయి. ఆపై తుది నిర్ణయం తీసుకునే వీలున్నది. అయితే పన్ను వసూళ్లను పెంచడంలో భాగంగానే ఆయా వస్తూత్పత్తులపై ఈ ట్యాక్స్ రేట్ల సర్దుబాట్లు అని సమాచారం. దీంతో ఖజానాను నింపుకోవడానికి భవిష్యత్తులో మరిన్ని వస్తూత్పత్తులను ఈ హై రేంజ్ కేటగిరీలోకే మోదీ సర్కారు తెస్తుందా? అన్న అనుమానాలూ తలెత్తుతున్నాయి.

పన్ను రేట్ల సర్దుబాట్లు

దుస్తులు, మరికొన్నింటిపైనున్న జీఎస్టీ మార్పులపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ క్రమంలోనే విలువనుబట్టి రూ.1,500దాకా 5 శాతం, రూ.1,500-10,000 మధ్య 18 శాతం, రూ.10,000పైన 28 శాతం పన్నులు వేయాలని మంత్రుల బృందం నిర్ణయానికొచ్చినట్టు తెలుస్తున్నది. మొత్తం 148 వస్తూత్పత్తులు, సేవలపై ప్రస్తుతం పడుతున్న పన్ను రేట్లను సవరించాలని మంత్రుల బృందం ప్రతిపాదించింది. ఇప్పుడు అత్యధిక వస్తూత్పత్తులు, సేవలు 18 శాతం శ్లాబులోనే ఉన్న సంగతి విదితమే.

ఇదీ విధానం..

జీఎస్టీ విధానంలో నిత్యావసరాలకు పన్ను మినహాయింపు (0 శాతం) లేదా కనిష్ఠ శ్లాబు 5 శాతం పన్ను పడుతున్నది. అయితే లగ్జరీ, ఆరోగ్యానికి హాని కలిగించే, సమాజంపై చెడు ప్రభావం చూపే వాటిపై గరిష్ఠంగా 28 శాతం పన్ను ఉన్నది. వీటిలో ఖరీదైన కార్లు, మోటర్‌సైకిళ్లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు వంటి కన్స్యూమర్ డ్యూరబుల్స్, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు, కొన్ని రకాల శీతల పానీయాలు, గ్యాంబ్లింగ్, క్యాసినోలు, లాటరీ తదితర ఆన్‌లైన్ గేమ్స్ ఉన్నాయి. ఈ 28 శాతం పన్నుకు తోడు అదనంగా 22 శాతం సెస్సు కూడా ఉంటుంది. ఇక ప్రత్యేకంగా ముడి వజ్రాలు, రత్నాలపై పావు శాతం, బంగారంపై 3 శాతం జీఎస్టీ ఉన్నది. 2017 జూలై 1న జీఎస్టీని దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. వివిధ కేంద్ర, రాష్ట్ర పన్నులను కలిపి ఒకే దేశం, ఒకే పన్ను లక్ష్యంతో జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం పరిచయం చేసింది. ఇందుకుగాను ఆదాయాన్ని నష్టపోతున్న రాష్ర్టాలకు పన్ను వసూళ్లలో వాటాలనూ ఇస్తున్నది.

రికార్డుస్థాయిలో ఎన్‌ఎండీసీ ఉత్పత్తి

హైదరాబాద్, డిసెంబర్ 3: ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌ఎండీసీ రికార్డుస్థాయిలో ఉత్పత్తిని సాధించింది. నవంబర్ నెలకుగాను 4.51 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేసింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తైన 3.83 మిలియన్ టన్నులతో పోలిస్తే 18 శాతం అధికమైనట్లు కంపెనీ వెల్లడించింది. అలాగే కంపెనీ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 5.5 శాతం ఎగబాకి 4 మిలియన్ టన్నులకు చేరుకున్నట్లు కంపెనీ డైరెక్టర్(ఫైనాన్స్) అమితవ ముఖర్జీ తెలిపారు.

అప్రిలియా ఆర్‌ఎస్ 457 ధర పెంపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: స్పోర్ట్స్ బైక్ అప్రిలియా ఆర్‌ఎస్ 457 ధరను రూ.10 వేలు పెంచుతున్నట్లు పియాజియో వెహికల్ సంస్థ ప్రకటించింది. పెరిగిన ధరలు జనవరి నుంచి అమలులోకి రానున్నట్లు పేర్కొంది. ఇటాలియన్ పియాజియో గ్రూపునకు చెందిన బ్రాండే అప్రిలియా. ప్రస్తుతం ఈ స్పోర్ట్స్ బైకు రూ.4.2 లక్షల ప్రారంభ ధరతో లభిస్తున్నది.

ఆఫీస్ స్పేస్‌లో రీట్స్‌దే హవా

526 మిలియన్ చదరపు అడుగులు సొంతం

విలువ రూ.4.5 లక్షల కోట్లు: వెస్టియన్ తాజా నివేదిక

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: దేశంలోని 7 ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లకు చెందిన ఆఫీస్ స్పేస్ 526 మిలియన్ చదరపు అడుగులుగా ఉన్నదని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ మంగళవారం తెలిపింది. 'రీట్స్: రీషేపింగ్ ఇండియాస్ కమర్షియల్ స్పేస్' పేరిట విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు వెల్లడించింది. ఈ స్టాక్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లుగా ప్రకటించింది. హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, చెన్నై, పుణె, కోల్‌కతా నగరాల్లో మొత్తం 884.1 మిలియన్ చదరపు అడుగుల గ్రేడ్-ఏ కార్యాలయ స్థలాలున్నాయని వెస్టియన్ డాటా చెప్తున్నది. ఇందులో రీట్స్‌కు చెందినదే 526.3 మిలియన్ చదరపు అడుగులని, దీని విలువ రూ.4.5 లక్షల కోట్లు అని స్పష్టం చేసింది. దీనిలో స్టాక్ మార్కెట్లలో నమోదైన రీట్స్‌ల్లో మూడింటికి చెందినదే 110.7 మిలియన్ చదరపు అడుగులుగా ఉందని వివరించింది.

హైదరాబాద్ టాప్

ఆయా నగరాలపరంగా చూస్తే.. హైదరాబాద్‌లోని మొత్తం ఆఫీస్ స్పేస్‌లో దాదాపు 74 శాతం రీట్స్ ఆధ్వర్యంలోని ఆఫీస్ స్పేసే కావడం గమనార్హం. అలాగే ముంబై, పుణెల్లో గల ఆఫీస్ స్పేస్‌లో రీట్స్‌కు చెందినదే 50 శాతం. అయితే ఈ విషయంలో 24 శాతంతో కోల్‌కతా ఆఖర్లో ఉన్నట్టు వెస్టియన్ తెలియజేసింది. ఇక ఈ ఏడు ప్రధాన నగరాల్లో రీట్స్‌కున్న ఆఫీస్ స్పేస్‌లో 60 శాతానికిపైగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలోనే ఉన్నది. ఇదిలావుంటే భారతీయ రీట్ సంస్థల్లో 4 మాత్రమే స్టాక్ మార్కెట్లలో నమోదయ్యాయని, వీటి ఆధ్వర్యంలో అటు రిటైల్, ఇటు ఆఫీస్ మార్కెట్లలోని స్పేస్ 125 మిలియన్ చదరపు అడుగులని వెస్టియన్ ఈ సందర్భంగా తెలిపింది.

- 2014లో రీట్స్ మొదలు.
- 2019లో స్టాక్ మార్కెట్లలోకి.
- ప్రస్తుతం 4 రీట్స్ ట్రేడ్ అవుతుండగా, వాటిలో బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ ఉన్నాయి.
- నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్‌కు రియల్ ఎస్టేట్ అసెట్స్ మాత్రమే ఉన్నాయి.

సుమధుర గ్రూపు లగ్జరీ ప్రాజెక్ట్

హైదరాబాద్,డిసెంబర్ 3: దక్షిణాదికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సుమధుర గ్రూపు..తాజాగా హైదరాబాద్‌లో లగ్జరీ ప్రాజెక్టు పలైస్ రాయల్‌ను అభివృద్ధి చేస్తున్నది. ఈ విలాసవంతమైన ప్రాజెక్టు ద్వారా రూ.2,500 కోట్ల ఆదాయం సమకూరవచ్చునని తెలిపింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు సమీపంలో నిర్మించతలపెట్టిన పలైస్ రాయల్ ప్రాజెక్టును 7.35 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేస్తున్నది. మూడు విభాగాల్లో నిర్మిస్తున్న ఈ 52 అంతస్తుల ఎత్తైన టవర్‌లో 4 లేదా 5 పడక గదులు కలిగిన 523 యూనిట్లను నెలకొల్పుతున్నది. ప్రస్తుతం నిర్మాణాలు ప్రారంభించిన ఈ ప్రాజెక్టును 2029 నాటికి అందుబాటులోకి తీసుకురానున్నట్లు సుమధుర గ్రూపు సీఎండీ మధుసూధన్ తెలిపారు.

17 కోట్లకు విమాన ప్రయాణికులు!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేరుకునే అవకాశం: ఇక్రా అంచనా

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: దేశీయంగా విమానాలు ఎక్కేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 7 శాతం నుంచి 10 శాతం వృద్ధితో 16.4 కోట్ల నుంచి 17 కోట్లకు చేరుకునే అవకాశం ఉన్నదని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది. అలాగే విమానయాన సంస్థల నష్టాలు కూడా రూ.2-3 వేల కోట్ల స్థాయిలో ఉంటాయని వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో విమాన ప్రయాణికులు 5.3 శాతం ఎగబాకి 7.93 కోట్లకు చేరుకున్నారు. అలాగే అంతర్జాతీయ ప్రయాణికులు 16.2 శాతం చొప్పున అధికమయ్యారు.

ఆశాజనకం విమాన రంగం

దేశీయ విమానయాన రంగంపై ఇక్రా ఆశాజనక వృద్ధిరేటును ప్రకటించింది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండటంతో వచ్చే ఏడాది ఈ రంగం నిలకడైన వృద్ధిని నమోదు చేసుకోనున్నదని పేర్కొంది. ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కింజల్ షా మాట్లాడుతూ..ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో విమానయాన రంగం రూ.2 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల స్థాయిలో నష్టాలను నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అధిక ఇంధన ధరలతో ఇబ్బందులు పడిన విమానయాన సంస్థలు గడిచిన రెండేండ్లుగా ధరలు తగ్గడంతో లాభాలు మెరుగుపరుచుకుంటున్నాయని, మరోవైపు నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడానికి అధికప్రాధాన్యతనిస్తున్నాయన్నారు. ఈ ఏడాది తొలి ఎనిమిది నెలల్లో కిలో లీటర్ విమాన ఇంధన ధరలు 6.8 శాతం తగ్గి రూ.96,192గా నమోదయ్యాయి. మొత్తం నిర్వహణ ఖర్చుల్లో ఇంధనకోసం పెట్టే ఖర్చు 30 శాతం నుంచి 40 శాతంగా ఉంటుండగా, మరో నిర్వహణ ఖర్చులు 35-50 శాతం స్థాయిలో ఉంటున్నాయని తెలిపింది. వీటిలో విమానాల నిర్వహణ, చమురు, ఇంజిన్ మెంటనెన్స్ కూడా ఉన్నాయి.

మరిన్ని వార్తలు
ntnews.com లో చూడగలరు

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

టెండర నోటీస్ నెం. 74 to 78_DRM_W_HYB, తేది: 02.12.2024

PUB/1199

దిగువ తెలిపిన పనుల కొరకు డివిజనల్ రైల్వే మేనేజర్/పనులు, హైదరాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు భారత రాష్ట్రపతి తరపున 30.12.2024న 15.00గం.ల వరకు ఓపెన్ టెండర్లు కోరుతున్నారు.

1. టెండర్ నెం.: 74_DRM_W_HYB, **పని పేరు:** A) స్క్రాప్ డిపో, లాలాగూడ వద్ద PSC రిలీజ్డ్ స్లీపర్స్‌తో సైజ్ (ఒక్కొక్కటి 8.58mX6.92) 50 నెం.లు స్క్రాప్ బిన్స్ నిర్మాణం. B) CWS/LGD- DHMU షెడ్ 150MX 9.7 ప్రక్కన ట్రాక్స్ వద్ద ఫ్లోరింగ్ (11.03.42.21.4.52.001). **సుమారు విలువ:** రూ.1,69,01,549.00, **బయానా:** రూ.2,34,500.

2. టెండర్ నెం.: 75_DRM_W_HYB, **పని పేరు:** హైదరాబాద్ డివిజన్: 7వ బెటాలియన్/RPSF/మౌలాలి, హైదరాబాద్ వద్ద స్టోర్ రూమ్స్‌తో యూనిట్ డ్రై మరియు వెట్ క్యాంటీన్ కొరకు ఒక రెండు అంతస్తుల బిల్డింగ్ నిర్మాణం. B) హైదరాబాద్ డివిజన్: 7వ బెటాలియన్/RPSF/మౌలాలి, హైదరాబాద్ వద్ద (20 అ. x 30 అ. ఒక్కొక్క రూమ్) 8 నెం.ల స్టోర్ రూమ్ కలిగిన రెండు అంతస్తుల బిల్డింగ్ నిర్మాణం. (11.03.64.24.3.52.002) (11.03.64.24.3.52.003) (**సుమారు విలువ:** రూ.2,78,45,811.82, **బయానా:** రూ.2,89,200.

3. టెండర్ నెం.: 76_DRM_W_HYB, **పని పేరు:** A) హైదరాబాద్ డివిజన్: SC-MUE సెక్షన్: నిజామాబాద్: అప్రోన్ రోడ్ నెం.1లో పంపింగ్ స్లీపర్స్ గ్రౌటింగ్ మరియు పగిలిన PSC స్లీపర్స్ రిప్లేస్‌మెంట్. B) జోనల్ సివిల్ ఇంజనీరింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్- నార్త్ లాలాగూడ (Rev) వద్ద మోడల్ ట్రాక్ నిర్మాణం. (**సుమారు విలువ:** రూ. 76,48,851.47, **బయానా:** రూ.1,53,000.

4. టెండర్ నెం.: 77_DRM_W_HYB, **పని పేరు:** సికింద్రాబాద్-జోన్ సెక్షన్: సికింద్రాబాద్ మరియు జోన్ స్టేషన్ల మధ్య వివిధ ప్రదేశాల వద్ద 60 కెజి రైల్ జాయింట్స్ ఇన్-సిటు వెల్డింగ్. (మంజూరైన పనుల పోర్ట్ (1) CTR(P)- 14.70 Kms, (2) CTR(P)- 25.93 Kms TRR(P)-0.80 Kms, (3) CTR (P)- 18.71 Kms & TRR(P)-1.10 Kms, (4) CTR(S)- 15.838 Kms & TRR (S)-2.542 Kms, (5) TRR- 47 సెట్స్ మరియు TTR-6 సెట్స్) (11.03.31.24.3.52.001, 002, 003, 009, 014) (**సుమారు విలువ:** రూ.58,30,247.00, **బయానా:** రూ.1,16,600.

5. టెండర్ నెం.: 78_DRM_W_HYB, **పని పేరు:** 1) SSE/PW/WDR అధికార పరిధిలో సెస్ రిపేర్. 2)JKM-BDHN సెక్షన్: SSE/PW/NZB అధికార పరిధిలోJKM-BDHN సెక్షన్ వద్ద సెస్ రిపేర్. 3) TFTR-Toe bank-2.60 KM. **సుమారు విలువ:** రూ.3,01,31,452.35, **బయానా:** రూ.3,00,700.

తదుపరి వివరాల కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in దర్శించండి.

డివిజనల్ రైల్వే మేనేజర్, వర్క్స్, హైదరాబాద్

A1533

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి

ఇన్‌చార్జి సీపీని కలిసిన ఆర్టీసీ ఆర్‌ఎం

వినాయక్‌నగర్, డిసెంబర్ 3: నిజామాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన జోత్స్న.. నిజామాబాద్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్ సింధూ శర్మను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాని అందజేశారు. ఆర్‌ఎంతో పాటు డిప్యూటీ రీజినల్ మేనేజర్లు శంకర్, సరస్వతి ఉన్నారు.

రుద్రూర్‌లో మూడు చోట్ల చోరీ

రుద్రూర్, డిసెంబర్ 3: రుద్రూర్‌లో సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు మూడు ప్రదేశాల్లో చోరీకి పాల్పడ్డారు. మండల కేంద్రంలోని వైన్స్ దుకాణం, అంగడిబజారులో ఓ కిరాణా షాపు, హోటల్‌లో దొంగతనం చేశారు. వైన్స్ వెనుక భాగంలో రేకును కత్తిరించి లోపలికి చొరబడి మద్యం బాటిళ్లు, సుమారు 60 వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లినట్లు యజమాని తెలిపారు. కిరాణా షాపులో వెనుకాల గొడను పగులగొట్టి కిరాణా సామగ్రి, ఐదు వేల రూపాయల నగదును చోరీ చేసినట్లు దుకాణా యాజమాని షేక్ వహీద్ తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్లుస్ టీం సహాయంతో వేలి ముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.3.85 కోట్ల విలువైన మత్తు పదార్థాల దహనం

వినాయక్‌నగర్/ జక్రాన్‌పల్లి, డిసెంబర్ 3: కామారెడ్డి జిల్లాలోని పలు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు చేసిన దాడిలో పట్టుబడిన నిషేధిత మత్తు పదార్థాలను మంగళవారం దహనం చేశారు. మండలంలోని పడకల్ తండా శివారులోని శ్రీ మెడికేర్ సర్వీసెస్‌లో దహనం చేసినట్లు కామారెడ్డి జిల్లా ఎక్సైజ్ అధికారి హన్మంత్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ వి.సోమిరెడ్డి ఆదేశాల మేరకు జక్రాన్‌పల్లి మండలంలోని పడకల్ గ్రామశివారులోని శ్రీ మెడికేర్ సర్వీసెస్‌లో కామారెడ్డి జిల్లాలో ఎక్సైజ్ స్టేషన్‌లో 36 ఎన్‌డీపీఎస్ పాత కేసుల్లో పట్టుబడిన 783.36 కిలోల ఎండు గంజాయి, 12.625 కిలోల అల్ప్రాజోలం 1.15 కిలోల డైజోఫామ్ 852 గ్రాముల క్లోరల్ హైడ్రేట్, 230 గంజాయి మొక్కలను దహనం చేశామన్నారు. కార్యక్రమంలో సీఐలు మధుసూదన్‌రావు, షాకీర్ అహ్మద్, సత్యనారాయణ, ఎస్సైలు విక్రమ్‌కుమార్, తేజస్విని, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

రుద్రూర్, డిసెంబర్ 3: మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలో మూడు రోజుల నుంచి తాగునీటికి ఇబ్బంది ఏర్పడింది. దీంతో గ్రామస్తులు మంగళవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. అధికారులు వెంటనే నీటి ఎద్దడి తీర్చాలని కోరారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మున్సిపల్ కార్మికురాలికి ఏజెంట్ టోకరా

మోసపోయిన మల్లమ్మ

వినాయక్‌నగర్, డిసెంబర్ 3: నిజామాబాద్ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికురాలికి ఓ ఏజెంట్ నమ్మించి నట్టేట ముంచాడు. లోన్ ఇప్పించి ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.4 లక్షలు కాజేసిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం..గాజులపేట్‌కు చెందిన మల్లమ్మ మున్సిపల్ కార్మికురాలిగా పనిచేస్తున్నది.ఆమెకు పరిచయం ఉన్న శివ అనే ఓ ఏజెంట్ బ్యాంకు నుంచి లోన్ ఇప్పిస్తానంటూ ఆమె నుంచి అవసరమైన అన్ని డాక్యుమెంట్స్ తీసుకున్నాడు.నవంబర్ 30 మల్లమ్మకు రూ.5 లక్షలు లోన్ మంజూరైంది. ఈ విషయం తెలుసుకున్న ఏజెంట్ శివ ఆమెకు తెలియకుండానే ఖాతాలోంచి రూ.4లక్షలు కాజేశాడు. దీనిపై బాధితురాలు ఏజెంట్‌ను ప్రశ్నించగా ఇంకా లోన్ మంజూరు కలేదని నమ్మబలికాడు. దీంతో బ్యాంకు స్టేట్‌మెంట్ తీయించడంతో ఆమె ఖాతాలోంచి రూ.4 లక్షలు డ్రా చేసినట్లు తెలుసుకున్న మల్లమ్మ.. తనన మోసం చేసిన ఏజెంట్ పై రెండోటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీసీసీబీలో సంబురాలు

కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి

ఖలీల్‌వాడి, డిసెంబర్ 3: బ్యాంకు వ్యాపార కార్యకలాపాలు 2000 కోట్ల మార్కు చేరుకున్న సందర్భంగా డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన లక్ష్యం చేరుకున్నందుకు ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్‌పాటిల్, యాదగిరి, నాగభూషణం, అనుపమ, సుమమాల తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలు జాతి దూడలు

పోతంగల్, డిసెంబర్ 3: కృత్రిమ గర్భధారణతో మేలు జాతి దూడలు జన్మిస్తాయని పశు ఘనాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ మజీద్ హైమద్ తెలిపారు. మండలంలోని కొడిచర్లలో గర్భకోశ చికిత్స శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. పశువులకు సూది పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు మండల పశు వైద్యాధికారి సురేశ్ తెలిపారు. సహాయకుడు సుధీర్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ తిరుపతి, గోపాల మిత్రలు నాగేశ్, రియాజ్, రాము, మైత్రి రాజేశ్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇండ్లను

పంపిణీ చేయాలి

కంఠేశ్వర్, డిసెంబర్ 3: డబుల్ బెడ్ రూం ఇండ్లతోపాటు రాజీవ్ గృహ కల్ప సముదాయాలను సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూంలో వసతులు మెరుగుపర్చి పేదలకు పంపిణీ చేయాలన్నారు. రెండేండ్లుగా వాటి అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో తాగుబోతులకు, అసాంఘిక కార్యకలాపాలు చేసే వారికి అడ్డాగా మారాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు నూర్జహాన్, కమిటీ సభ్యులు విఘ్నేశ్, రాములు, శ్రీనివాస్, పద్మ, దినేశ్, సుచిత్ పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, డిసెంబర్ 3: డిచ్‌పల్లిలోని ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్, సీసీటీవీ ఇన్‌స్టలేషన్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెంది, 19 నుంచి 40 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత హాస్టల్, భోజన వసతి ఉంటుందని పేర్కొన్నారు. అర్హులు గన్‌పూర్ రోడ్డులోని కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 08461-295428 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపు బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

డిచ్‌పల్లి, డిసెంబర్ 3: సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రేపు(గురువారం) బేస్‌బాల్ సీనియర్ మహిళల జిల్లా జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు జ్యోత్స్న, కోచ్ మౌనికకు రిపోర్టు చేయాలని సూచించారు.

శ్రీకాంతాచారికి నివాళి

ఖలీల్‌వాడి/నందిపేట్, డిసెంబర్ 3: తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించారు. నగరంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శ్రీకాంతాచారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నాయకులు సత్యప్రకాశ్, తెలంగాణ శంకర్, శేఖర్, రాజు, మీసాల శంకర్, విజయ్‌కుమార్, కృష్ణ, అనిల్, భూపతి, సాదిక్ పాల్గొన్నారు. నందిపేట్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆపార్టీ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలగంగాధర్, మనోజ్, సయ్యద్ హుస్సేన్, సురేశ్, భరత్, పాషా, అశోక్, నరేశ్, విజయ్, చిన్నయ్య, వెంకటేశ్, సురేశ్, ప్రవీణ్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. నవీపేటలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్ధంతి నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు భూమాచారి, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలోని పార్టీ కార్యాలయంలో శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు

విద్యార్థులకు క్రీడాపోటీలు

జక్రాన్‌పల్లి/ చందూర్/ పోతంగల్, డిసెంబర్ 3: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమగ్ర శిక్షా విద్యాశాఖ ఆధ్వర్యంలో పలుచోట్ల విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. నవీపేట మండల కేంద్రంలోని దర్యాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో అశోక్ హాజరై మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులను ప్రదానం చేశారు.జక్రాన్‌పల్లిలో ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. చందూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. తహసీల్దార్ శాంత, హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు. కోటగిరిలో ఎంఈవో శ్రీనివాస్‌రావు బహుమతులను అందజేశారు. పోతంగల్‌లో ఎంఈవో ఎల్.శంకర్, ఐఈఆర్టీ విఠలేశ్వర్, రాందాస్ పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి భవిత పాఠశాలలో ఎంఈవో ఆంధ్రయ్య మాట్లాడారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వేల్పూర్ ఎమ్మార్సీలో దివ్యాంగులకు వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ఎంఈవో రేణుక బహుమతులను అందజేశారు. వేల్పూర్ ప్రభుత్వ పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రెంజల్ మండలం సాటాపూర్ భవిత కేంద్రం, రెంజల్ జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించి కాంప్లెక్స్ హెచ్‌ఎం శంకర్ బహుమతులను అందజేశారు.

ఉమ్మడి జిల్లా అండర్17 సైక్లింగ్ పోటీలు

కంఠేశ్వర్, డిసెంబర్ 3: నిజామాబాద్ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అండర్-17 సైకిల్ పోటీలను మంగళవారం నిజామాబాద్‌లోని బైపాస్ రోడ్డులో నిర్వహించారు. ఈ పోటీల్లో మనీష్, రాఖీ బాబా, రాథోడ్ కార్తీక్, అఖిల్‌రెడ్డి విజేతలుగా నిలిచినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి తెలిపారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు.

కిరాణాషాపు నిర్వాహకుడికి రెండ్రోజుల జైలు

వినాయక్‌నగర్, డిసెంబర్ 3: నిజామాబాద్ నగరంలోని మూడో టౌన్ ఏరియాలో రాత్రి నిర్ణీత సమయం దాటిన అనంతరం షాపు తెరిచి ఉంచిన కిరాణా షాపు నిర్వాహకుడికి రెండ్రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మంగళవారం తీర్పు వెలువరించారు. చంద్రశేఖర్ కాలనీకి చెందిన మోహన్ నవంబర్ 30వ తేదీన రాత్రి షాపు తెరిచి ఉంచడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. అతడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా.. మెజిస్ట్రేట్ రెండ్రోజుల జైలు శిక్ష విధించారన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

వినాయక్‌నగర్, డిసెంబర్ 3: తన భార్య కాపురానికి రావడం లేదని షేక్ సలీం(31) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగారం ప్రాంతానికి చెందిన సలీం మద్యానికి బానిస కావడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన అతడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గంగాధర్ తెలిపారు.

సిగరెట్ కోసం వచ్చి.. గొలుసు చోరీ

వినాయక్‌నగర్, డిసెంబర్ 3: దుకాణ యజమానురాలి మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన నగరంలోని మూడో ఠాణా పరిధిలో మంగళవారం ఉదయం చోటుచేసుకున్నది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. సుభాష్‌నగర్ ప్రాంతంలోని రాధాకృష్ణ థియేటర్ వద్ద రజనీ కిరాణ దుకాణం నడుపుతున్నది.

మంగళవారం ఉదయం ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి సిగరేట్ తీసుకొని రూ.వంద నోటు వచ్చాడు. చిల్లర ఇచ్చేందుకు ఆమె కౌంటర్ వద్ద వంగగా.. మెడలోని బంగారు గొలుసును తెంచుకొని, ఆమెను నెట్టివేసి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మూడు టౌన్ ఎస్సై మహేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.